# టూరిస్టులు కావాల్నా ప్రజల్లో ఉండే పెద్ది కావాల్నా?

- నర్సంపేట ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్



నర్సంపేట ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్ చిత్రంలో ప్రజలకు అభివాదం చేస్తున్న నర్సంపేట నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

## అభివృద్ధి కొనసాగాలంటే సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలె

వరంగల్, నవంబర్ 13 (నమస్తేతెలంగాణ) : ఆరు నూరైనా మళ్లీ ఎక్కువ సీట్లతో గెలిచి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిని గెలిపిస్తే నర్సంపేట నియోజకవర్గానికి లాభం జరుగుతుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. 'పెద్ది సుదర్శన్‌రెడ్డిని గెలిపించండి, మీకు కావాల్సిన పనులు చేసే బాధ్యత నాది' అని స్పష్టం చేశారు. పెద్ది అధ్యక్షతన సోమవారం నర్సంపేట శివారు నర్సాపురంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలనుద్దేశించి సీఎం కేసీఆర్ ప్రసంగించారు. సభకు హాజరైన ప్రజలను చూశాక ఇక్కడ పెద్ది కచ్చితంగా భారీ మెజారిటీతో గెలిచిపోయాడని అర్థమవుతోందని, అరవై ఏండ్ల నాటి కల పాకాలకు గోదావరి నీళ్లను సుదర్శన్‌రెడ్డి సాధించిండని చెప్పారు. పాకాలకు గోదావరి జలాల డిమాండ్‌ను గతంలో ఎవరూ తీర్చలేకపోయారని, ఎమ్మెల్యేగా పెద్ది పాకాలకు గోదావరి జలాలను తెచ్చి నర్సంపేట నియోజకవర్గ ప్రజల కలను సాకారం చేశారని గుర్తుచేశారు. నర్సంపేట నియోజకవర్గంలో గతంలో యాసంగి 30 నుంచి 35 వేలలోపు ఎకరాల్లో పంట పండితే ఇపుడు గోదావరి జలాలు వచ్చిన తర్వాత 1.35 లక్షల ఎకరాల్లో పంట పండుతోందని, పాకాల కింద పంటలకు ఢోకా లేకుండా చేశాడన్నారు. పెద్ది కోరిక మేరకు ఎన్నికల తర్వాత పాకాల, రంగాయ చెరువుల కాల్వలను బాగు చేసుకుందామని, నర్సంపేట పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు కూడా వేసుకుందామని చెప్పారు. సుదర్శన్‌రెడ్డి గెలిచిన తర్వాత తాను ఇక్కడికొచ్చి నియోజకవర్గానికి కావల్సిన పనులు చేసే బాధ్యత తనదని తెలిపారు. కచ్చితంగా దీన్ని జనంలో చర్చ పెట్టాలని, పెద్ది కమిట్‌మెంటును చూడాలని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్‌కు కూడా రాడని, వస్తే కారు అక్కడ ఆగదని, తెల్లారేసరికే నర్సంపేటకు వస్తాడని చెప్పారు.

### పెద్ది అడిగితే మెడికల్ కాలేజీ..

జిల్లా వైద్యశాలను నర్సంపేటకు తెచ్చింది సుదర్శన్‌రెడ్డేనని, వరంగల్ జిల్లా కోటాలోని మెడికల్ కాలేజీ నర్సంపేటలో పెట్టాలని పెద్ది అడిగితే మంజూరు చేశామని సీఎం చెప్పారు. దీంతో నర్సంపేటకు ప్రత్యేకత ఏర్పడిందని చెప్పారు. పదేళ్ల నుంచి నర్సంపేట నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని, పెద్ది సుదర్శన్‌రెడ్డి నాయకత్వంలో పనులు జరుగుతున్నాయని కేసీఆర్ వివరించారు. సమైక్యవాదులు వస్తమంటే నర్సంపేట ప్రజలు నిరసన తెలిపారని గుర్తు చేశారు. 'వైఎస్ షర్మిల డబ్బు కట్టలతో పెద్ది సుదర్శన్‌రెడ్డిని ఓడిస్తదట, డబ్బు కట్టలు గెలువొద్దు 24 గంటల కరెంటు గెలువాలె.. పరాయి రాష్ట్రమోళ్లొచ్చి డబ్బు సంచులతో ఓడిద్దామంటే మనం ఓడిపోదామా? ఆలోచించాలె' అని ప్రజలను కోరారు. సుదర్శన్‌రెడ్డిని గత ఎన్నికల్లో గెలిపించి మంచి పనిచేశారని, ఆయన నాయకత్వంలో పనులు బాగా జరిగాయన్నారు. సభలో మంత్రి సత్యవతి రాథోడ్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, రాష్ట్ర జలవనరుల సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్, ఎంపీలు మాలోత్ కవిత, దయాకర్, జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీ కిషన్, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్, జడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, రాయిడి రవీందర్‌రెడ్డి, నల్లా మనోహర్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి నల్లా మనోహర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నం మొగిలి, ఎంపీపీలు వేములపల్లి ప్రకాశ్‌రావు, ఊడుగుల సునీత, రమేశ్, కాట్ల కోమల, జడ్పీటీసీలు పత్తినాయక్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు విజన్ లేదు..

**- బీఆర్ఎస్ నర్సంపేట అభ్యర్థి, ఎమ్మెల్యే పెద్ది**

నర్సంపేట : అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులకు విజన్ లేదని, వారి చేతిలో నర్సంపేట అభివృద్ధి చెందదని నర్సంపేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు తనను ఓడించేందుకు ప్రతి ఎన్నికల్లో ఒక్కటవుతున్నారన్నారు. ఈ నాయకులు ఎన్నికలు రాగానే నియోజకవర్గానికి వస్తున్నారని, ఎన్నికల తర్వాత ప్రజలకు కనిపించకుండా పోతున్నారని దుయ్యబట్టారు. కరోనా సమయంలోనూ ఈ నాయకులు ఇంటికి తాళం వేసుకొని లోపల ఉన్నారని, ప్రజలు ఆపదలో ఉంటే పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. ఇద్దరు నాయకులకు అభివృద్ధిపై ప్రణాళిక లేదన్నారు. తనకు వాటాలు, కోటాలు లేవని, తాను రౌడీని కాదని, ప్రజల మధ్యే ఉంటున్నానని చెప్పారు. ప్రజలతోనే ఎక్కువ కాలం ఉన్నానని, నర్సంపేటలోనే నివాసం ఏర్పాటు చేసుకున్నానని, తాను హైదరాబాదో, హన్మకొండ నుంచో రావడం లేదని చెప్పారు. ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ఒక్క టర్మ్‌లోనే ఎంతో అభివృద్ధి చేసి చూపించానని తెలిపారు. కరోనాతో ప్రజలు బాధ పడుతుంటే ప్రజల మధ్యే ఉంటూ ఐసొలేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి 1079 మందిని రక్షించినట్లు తెలిపారు. సొంత నిధులతో ప్రత్యేకంగా ఆక్సిజన్ సిలిండర్లను కొనుగోలు చేయించానని గుర్తుచేశారు. ఎక్విప్‌మెంట్ కూడా సమకూర్చానని వివరించారు.తనకు కూడా మూడు సార్లు కరోనా వచ్చిందని గుర్తుచేశారు. నర్సంపేటలో మెడికల్ కళాశాల, జిల్లా వైద్యశాల, క్రిటికల్ కేర్ యూనిట్, హార్టీకల్చర్ రీసెర్చ్ సెంటర్, డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటు చేశానని చెప్పారు. కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, మరికొన్ని టెండర్ దశలో ఉన్నాయని, తాను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిస్తే వాటిని త్వరలోనే పూర్తి చేయిస్తానని చెప్పారు. రూ.180 కోట్లతో నర్సంపేట పట్టణాన్ని అభివృద్ధి చేశానని వివరించారు. ఉద్యమ కాలంలో నర్సంపేటలో తిరిగిన కేసీఆర్, ఇక్కడి ప్రజల జీవనస్థితిని చూశారని గుర్తుచేశారు. మళ్లీ తనను గెలిపించి కాంగ్రెస్ నాయకుల డ్రామాలను తిప్పికొట్టాలని ప్రజలను కోరారు.

### కంటి సమస్యే కారణం..

ఉద్యమ కాలంలో వరంగల్ జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తనను పోలీసులు అరెస్టు చేయడం, వాటర్ క్యాన్లతో దాడులు చేయడం వల్ల తన ఒళ్లంతా హూనమైందని, ఒక కంటికి కూడా గాయమై కనిపించని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అందువల్లే ఎవరైనా నమస్తే పెడితే గుర్తించే పరిస్థితి ఉండడం లేదని, దీంతో ఎదుటివాళ్లు తప్పుగా అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. కంటి సమస్యతోనే ఇలా జరుగుతున్నదని, ఎక్కువ సేపు నిలబడినా, తిరిగినా కాళ్లు పనిచేయలేని పరిస్థితి ఉందని, ప్రజలు తనను తప్పుగా భావించొద్దని కోరారు.

# పరకాలలో విపక్షాలకు స్థానం లేదు

- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- తొమ్మిదిన్నరేండ్లలో మారిన నియోజకవర్గ రూపురేఖలు
- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- పార్టీలో చేరిన కాంగ్రెస్, టీడీపీ శ్రేణులు, యువత

పరకాల/గీసుగొండ, నవంబర్ 13 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి జరిగిందని, గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో పరకాల రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన టీడీపీ శ్రేణులు, పరకాల యువత బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విపక్షాలకు స్థానం లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పరకాల నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందన్నారు. కానీ ప్రత్యేక తెలంగాణలో సీఎం కేసీఆర్ చొరవతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల టీడీపీకి చెందిన నేత పార్టీ శ్రేణులను పట్టించుకోకుండా ప్యాకేజీకి అమ్ముడుపోయాడని విమర్శించారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీలను ప్రజలు నమ్మొద్దని కోరారు. 24 గంటల కరెంటు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా? 3 గంటల కరెంటు చాలంటున్న కాంగ్రెస్ పార్టీ కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు. పార్టీలో చేరిన వారిలో ఆత్మకూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు కందుకూరి నరేశ్, కొంగర ప్రభాకర్, గోనె మధూకర్, సిద్దోజు రాజమౌళి, పైండ్ల రమణ, దామెరకు చెందిన నల్ల రవి, పరకాలకు చెందిన ఆంజనేయులు, సుంకరి దిలీప్, చిదురాల రామన్న, కృష్ణపాల్, పెంచాల రాజు, మెహరజ్ బేగం, గీసుకొండకు చెందిన తాటి సాంబశివారావు, కేదాసి స్వామి, సంపత్‌రెడ్డి, నీలం పరశురాములు, ఆంగోత్ అశోక్, ఆంగోత్ రాజు, ఆంగోత్ నవీన్, ఆంగోత్ రవి, ఆంగోత్ రాజశేఖర్, జీవన్, అక్షయ్‌కుమార్, వంశీ, యాకూబ్, రాజు, మహేందర్, రాజేందర్, ప్రశాంత్, మనోజ్, కుమార్, సతీశ్, కుమార్, రాజు, హరి, పరకాలకు చెందిన యువత ఎండీ అఫ్రోజ్, అనిల్, అశోక్, ఎస్ అఖిల్, శివకుమార్, ఎండీ ఉమర్, టీ దేవేందర్, గడ్డం విష్ణు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంగోత్ కవిత-మహబూబ్ నాయక్, ఉప సర్పంచ్ నర్సింహ, యూత్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ జూలూరి లెనిన్‌గౌడ్, నాయకులు వీరన్న, ప్రమోద్, హరి, భూక్యా రాజు, భద్రు పాల్గొన్నారు.



గీసుగొండ : కాంగ్రెస్ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



కొడకండ్లలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్ రావు

- కాంగ్రెస్ పార్టీకి ఓట్లేస్తే మళ్లీ చీకట్లే
- రేపు తొర్రూరులో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు
- సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

పాలకుర్తి/దేవరుప్పుల/కొడకండ్ల, నవంబర్13: బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరులో మంగళవారం నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వదాద సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు సల్లేరుపై నడకేనని అన్నారు. తాను కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించానన్నారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేయాలన్నదే తన ధ్యేయమని తెలిపారు. ఇప్పటి వరకు తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. భారీ మెజార్టీతో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే రాష్ట్రంలో మళ్లీ చీకట్లేనన్నారు. తొర్రూరులో మంగళవారం జరిగే కేసీఆర్ సభకు ఊర్లకు ఊర్లు తరలిరావాలని ఎర్రబెల్లి పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలకు ఓటడిగే హక్కు లేదని, వారిని జనం పట్టించుకోవడం లేదన్నారు. ఇక పాలకుర్తిలో అమెరికా పైసలు రాజ్యమేలుతున్నాయని, వాటికి ఆశపడ్డ కొందరు నాయకులు అటు పోతున్నారని, వారికి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. తన గెలుపు కోసం కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలన్నారు.

### మరోసారి ఆశీర్వదించండి..

కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేసి ఆశీర్వదించాలని మంత్రి దయా కర్‌రావు అన్నారు. నేడు తొర్రూరులో లక్ష మంది తో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దళిత, గిరిజన, బీసీ బంధు వంటి పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని, కాళేశ్వరం నీటితో తెలంగాణను సస్యశ్యామలం చేశాడని, ఎన్నో పథకాలు తెచ్చి తెలంగాణ ప్రజలను సుభిక్షంగా ఉంచిన కేసీఆర్‌ను గెలిపించాలని అన్నారు. ఇవ్వాళ ఇక్కడ, రేపు ఎక్కడో తెలియని వాళ్లకు ఓటు వేద్దా మా, మీ కష్టసుఖాల్లో పంచుకుంటున్న నాలాంటి వాడికి ఓటు వేస్తారా ప్రజలు తేల్చుకోవాలని చెప్పారు. కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమే అని, కరెంటు, నీటి కష్టాలు తప్పవని ప్రజలు గుర్తించాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలను అవమానించిన కాంగ్రెస్‌ను పాతర పెడదామని, దళితులను కాలుతో తన్నిన రేవంత్‌కు, తలదన్నే లా జవాబు చెబుదామని, ఆ పార్టీని ఓడించి, ఆ అహంకారాన్ని అణచివేద్దామని ఎర్రబెల్లి అన్నారు.

### ఎర్రబెల్లికి గుడికుంట వాసుల మద్దతు..

మంత్రి దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపిస్తామని, ఆయనకు తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు గుడికుంట తండావాసులు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యా లయంలో మంత్రి ఎర్రబెల్లిని కలిశారు. వారికి గులాబీ కండువులు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా మల్లంపెల్లి నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోచేరారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు..

కొడకండ్ల మండలం నర్సింగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యం మధు, జీబీ తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 4వ వార్డు సభ్యుడు గుగులోత్ రామ్ చందర్, నాయకులు వీరన్న హనుమంతు, సురేశ్, యాకేశ్, రాకేశ్ మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు.